Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

Press Release

# లక్ష కుటుంబాల కళ్లల్లో ఆనందం చూశా!

## రూ. 57 వేల కోట్లతో 17,40,000 గృహాల నిర్మాణం లక్ష్యం

## ఎన్టీఆర్ లక్ష గృహ ప్రవేశాల సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 2: ఇవాళ లక్ష గృహ ప్రవేశాలతో లక్ష కుటుంబాల కళ్లల్లో ఆనందం చూశానని, ఇది తన జీవితంలో మరపురాని రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ ఆవాస దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఎన్టీఆర్ లక్ష గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.

గ్రామీణ ప్రాంతాలలో 12 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ16 వేల కోట్లు వెచ్చిస్తున్నామని, పట్టణ ప్రాంతాలలో 5,40,000 గృహాల నిర్మాణానికి దాదాపు 33,000 కోట్లు వ్యయం చేస్తున్నామని, రెండూ కలిపి రూ.50 వేల కోట్లతో 17 లక్షల 40 వేల గృహాలను నిర్మించడం తమ లక్ష్యమని చంద్రబాబు వివరించారు. ఇళ్లు కట్టడం, పెళ్లి చేయడం కష్టమని అంటారని ముఖ్యమంత్రి చెప్పారు.

ఇదో శుభకార్యంగా భావిస్తూ, గృహప్రవేశాలు చేసిన లబ్ధిదార్ల దంపతులకు రాష్ట్రం ప్రభుత్వం పక్షాన నూతన వస్త్రాలను బహూకరిస్తున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు. లబ్ది దారులను అభినందిస్తున్నామన్నారు. ఒకే రోజు లక్షగృహప్రవేశాలతో దేశంలోనే ఒక చరిత్ర సృష్టించినట్లు చంద్రబాబు వివరిచారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్ర ద్వారా పేదవాళ్ల సమస్యలన్నీ తెలుసుకున్నానని.. వాటిని ఆర్థిక సమస్యలు అధిగమిస్తూ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని వివరించారు.

రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. విద్య, వైద్య రంగంలో పేదవాళ్ల ఖర్చు తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. పేదవారికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు.

## పైసా అవినీతి లేకుండా లక్ష గృహాలను నిర్మించాం

## అవినీతి జరిగితే కఠిన చర్యలు: చంద్రబాబు

ఒక్కపైసా అవినీతికి తావులేకుండా ఒకే రోజు లక్ష నూతన గృహాల ప్రారంభోత్సవం చరిత్రాత్మకమైనదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎవరైనా సరే మంజూరులో కానీ, బిల్లు ఇచ్చే సందర్భంలో లంచం అడిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలా ఎక్కడైనా జరిగితే 1100 కాల్ సెంటర్ కు ఫోన్ చేసి తమ దృష్టికి తేవాలని ముఖ్యమంత్రి కోరారు. గతంలో గృహనిర్మాణాల పేరుతో వేల కోట్ల రూపాయలు స్వాహా చేశారని విమర్శించారు. అలాంటి అవినీతి, అక్రమాలకు తాము నిరోధించామని, పూర్తి పారదర్శకంగా వ్యవహరించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

'మీకు చేతనైతే మరో 10 రూపాయలు అదనంగా ఇచ్చి ఇళ్లు ఇంకా మంచిగా నిర్మించాలి. అందగా ఉండాలి. చేయూతనివ్వాలి. అంతే తప్ప ఏరకంగానూ, ఎక్కడా అవినీతికి జరగడానికి వీలు లేదు' అని ముఖ్యమంత్రి అన్నారు. బిల్లుల మంజూరు సందర్భంగా లబ్దిదారుల సమాచారం తాను తీసుకుంటానని, లబ్దిదారులు నిర్మొహమాటంగా తన దృష్టికి తేవాలన్నారు. అవినీతికి పాల్పడితే ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ స్థాయిలో కూడా పైసా అవినీతికి తావు లేదని అన్నారు. ప్రతి ఇంటినీ జియో ట్యాంగింగ్ చేస్తున్నామని, ఛాయాచిత్రాలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఇవాళ లక్ష ఇళ్లు పూర్తయితే గృహ ప్రవేశాలు చేయించామని, వచ్చే క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు లక్ష, తాను ప్రమాణ స్వీకారం చేసిన వచ్చే జూన్ 8వ తేదీన మరో లక్ష ఇళ్లను ప్రారంభించి లబ్దిదారులకు అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమల కింద రూ.10వేలు ఇచ్చామని, కుటుంబంలో తోబుట్టువులే ఇచ్చే పరిస్థితి ఉండదని, అటువంటిది తాను ఈ బాధ్యత తీసుకున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు.

ఆర్థికంగా ఎన్ని కష్టాల్లో ఉన్నా రూ. 24 వేల కోట్ల మేర రైతులకు రుణమాఫీ చేశామన్నారు. పెళ్లికానుకలకు డబ్బులు ఇస్తున్నామని గుర్తుచేశారు. ఇది సంక్షేమ రాజ్యమని, పుట్టిన దగ్గరనుంచి గిట్టేదాకా వారి సంక్షేమాన్ని ప్రభుత్వం చూసుకోవాలన్న సిద్ధాంతం తమది అని, అదే పాటిస్తున్నామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. పండుగలకు కానుకలు ఇస్తున్నామని, 44 లక్షల పెన్షన్లు ఇస్తున్నామని చంద్రబాబు తెలిపారు. చంద్రన్న బీమా కింద చేస్తున్న సహాయాన్ని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా పి.ఎం.జె.జె.బి.వై, చంద్రన్న బీమా లోగోను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

## వచ్చే మార్చి లోగా పూర్తి ఓడీఎఫ్ సాధిస్తాం: ముఖ్యమంత్రి చంద్రబాబు

వచ్చే మార్చిలోగా రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఓడీఎఫ్ గ్రామాలుగా సాధిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో 4,471 గ్రామాలను మలవిసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించామని, ఇంకా 8,383 గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాల్సి ఉందని ముఖ్యమంత్రి వివరించారు. తమ ప్రభుత్వం వచ్చాక 48 లక్షల 20 వేల టాయిలెట్లను నిర్మించాలని గుర్తించామని చంద్రబాబు చెప్పారు. ఇప్పటికి లక్ష్యసాధన దిశలో ఇంకా 21 లక్షల 61 వేల మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రంలో మూడు జిల్లాలలో ఓడీఎఫ్ సాధించినట్లుతెలిపారు.

'ఈ రోజుమనమంతా ఒక పవిత్రమైన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. అందులో భాగస్వాములవుతున్నామని చంద్రబాబు అన్నారు. గాంధీజయంతి రోజు ఇటువంటి మహోన్నత కార్యక్రమం చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా 'సోమవారం విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో స్వచ్ఛతే సేవ' అవార్డుల ప్రదానోత్సవ సభలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ 'గాంధీజీ ఒక మహానాయకుడే కాదు. ప్రపంచాన్నే ప్రభావితం చేసిన మహాశక్తి'అని ముఖ్యమంత్రి నివాళులర్పించారు. నిన్నటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకున్నారని చంద్రబాబు అన్నారు. చరిత్ర ఉన్నంత కాలం ప్రపంచం మహాత్ముణ్ణి జ్ఞాపకం చేసుకుంటుందని చెప్పారు. తాను చెప్పిన సిద్ధాంతాన్ని, మటలను మనసా,వాచా ఆచరణలో పెట్టిన వ్యక్తి గాంధీజీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు శ్లాఘించారు.

'మనం మనకోసం చేసేది మనతోనే అంతరిస్తుందని, సమాజం కోసం చేసే పని చిరస్థాయిగా నిలిచిపోతుంది' అని గాంధీజీ అన్న మాటలు స్ఫూర్తిగా తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. మార్పు మన దగ్గర నుంచి ప్రారంభమైతే అది శాశ్వతమన్నారు. మనల్ని కొందరు పట్టించుకోరని, కొందరు హేళన చేస్తారని, తర్వాత దూషిస్తారని, ఆపై అడ్డుకుంటారని ముఖ్యమంత్రి అన్నారు. వీటన్నింటినీ అధిగమించి ముందుడుగు వేస్తే విజయాలను కైవసం చేసుకోవచ్చని చంద్రబాబు అన్నారు. అటువంటి విజయాలు శాశ్వతమన్నారు. స్వార్థం మనలో లేకుండా పనిచేయాలని, ఇది మహాత్ముడు అందించిన స్ఫూర్తి అని చంద్రబాబు తెలిపారు.

ఈ స్ఫూర్తిని భావితరాలకు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. దేశం స్వాతంత్ర్యం సాధించి మనం స్వతంత్ర్య పౌరులుగా జీవిస్తున్నామంటే అందుకు గాంధీజీ పోరాటం, ఆనాటి తరం చేసిన త్యాగాలే కారణమని ఆయన వివరించారు.

## స్ఫూర్తిదాత శాస్త్రీజీ

అక్టోబర్ 2వ తేదీన జన్మించిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి కడు పేదరికాన్ని అనుభవించారని, చదువుకోవాలంటే గంగా నదిని దాటేందుకు పడవ మీద వెళ్లాలని, ఆయన కొన్ని సార్లు నదిని ఈదుకుంటూ వెళ్లేవారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

సైనికులు యుద్ధం వచ్చినప్పుడే పోరాడతారని, సాంఘిక దురాచారాలపై అనునిత్యం పోరాడే వ్యక్తులే నిజమైన సామాజిక సైనికులని లాల్ బహదూర్ శాస్త్రి నిర్వచించారని అన్నారు. అపరిశుభ్రత, నిరక్షరాస్యతపైన పోరాడాలని పిలుపునిచ్చిన వ్యక్తి లాల్ బహదూర్ శాస్త్రి అని నివాళులర్పించారు. గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి పుట్టిన రోజులు ఒకేరోజు రావటం, ఈ రోజు ఇక్కడ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు చేపట్టడం తమ అదృష్టమని చంద్రబాబు అభివర్ణించారు.

మహానాయకుల జయంతి అంటే వేడుకచేయడం, మిఠాయిలు తిని వెళ్లడం కాదని, ఒక లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని చంద్రబాబు అన్నారు. సేవ మన జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు.

2019 అక్టోబర్ 2వ తేదీనాటికి దేశంలో అన్ని ప్రాంతాలలో మరుగుదొడ్లు రావాలని, మన దేశం ఒక పరిశుభ్రమైన దేశంగా రూపుదాల్చాలని ప్రధాని నరేంద్రమోడీ పిలుపునిచ్చారని చంద్రబాబు గుర్తుచేశారు.

మన రాష్ట్రంలో గతంలోనే పచ్చదనం, పరిశుభ్రం కార్యక్రమం ప్రారంభిని విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావిస్తూ..ప్రధాని స్వచ్ఛభారత్ సబ్ కమిటీ వేశారని దానికి తాను కన్వీనర్ గా ఉన్న విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు.

గతాన్ని గురించి బాధపడటం కాకుండా భవిష్యత్తు గురించి ఆలోచన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మరుగుదొడ్లు ఆడబిడ్డల ఆత్మగౌరవానికి చిహ్నాలని, వారి అవస్థలు తీర్చేందుకు ఇంటింటికీ మరుగుదొడ్డి కార్యక్రమం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు.

బహిరంగ విసర్జన రహిత ప్రాంతాలుగా జిల్లాలు, మండలాలు, గ్రామాలను తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్రంలో నూటికి నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలో మరెక్కడా లేని విధంగా పట్టణ ప్రాంతాల్లో ఓడీఎఫ్ సాధించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు.

చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చి ఆదాయవనరుగా మార్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించామని, ప్రజల ఆదాయ వనరులను పెంచుతామని చంద్రబాబు చెప్పారు. తర్వాత ముఖ్యమంత్రి సభికులచేత స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు.

తన మనవడు నారా దేవాంశ్‌తో కలసి ముఖ్యమంత్రి తొలుత మహాత్మాగాంధీకి, లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులర్పించారు. మంత్రులు నారా లోకేష్, దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, పితాని సత్యనారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని నాని, విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్, జడ్పీ చైర్ పర్సన్ గద్దె అనురాధ, ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్, బొండా ఉమామహేశ్వరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో చురుగ్గా పనిచేసిన 91 మందికి ముఖ్యమంత్రి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఒలింపిక్ పతక విజేత పీవీ సింధును, కవి,రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావును ముఖ్యమంత్రి సత్కరించారు.